Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 103 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 25 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## లాంతర్లు అవసరం లేదు, మొబైల్స్‌లో ఫ్లాష్‌లైట్లు ఉన్నాయి.. ఆర్జేడీకి మోదీ చురకలు



**బెగుసరాయ్:** జంగిల్ రాజ్ నేతలకు తమ కుటుంబాల పట్లే శ్రద్ధ అని, బిహార్ యువత జీవితాలను నాశనం చేశారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సారథ్యంలోని ఎన్డీయే బిహార్‌ను అభ్యుదయ పథంలోకి నడిపించిందని చెప్పారు. బిహార్‌లోని సమస్తీపూర్ జిల్లా కర్పూరీ గ్రామం నుంచి శుక్రవారం నాడు ఎన్నిక ప్రచారం ప్రారంభించిన ప్రధాని ఆ తర్వాత రెండో ర్యాలీగా బెగుసరాయ్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రధాని ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలకు లాంతర్ (ఆర్జేడీ ఎన్నికల గుర్తు) అవసరం లేదని, ఇప్పుడు వారి మొబైల్స్‌లో ఫ్లాష్‌లైట్లు ఉన్నాయని అన్నారు. బిహార్ యువత వలసలు వెళ్లడానికి ఆర్జేడీనే కారణమని విమర్శించారు. ఆర్జేడీ జంగిల్ రాజ్‌కు ఎన్డీయే స్వస్తి చెప్పి రాష్ట్రంలో సుపరిపాలన తెచ్చిందని అన్నారు. ఆర్జేడీ-కాంగ్రెస్ హయాంలో పెట్టుబడిదారులు రాష్ట్రం విడిచి పారిపోయారని, ఉద్యోగాల పేరుతో భూములు లాక్కున్న వాళ్లు యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు.

**ఆర్జేడీ అహంకారంతోనే..**

ఆర్జేడీ అహంకారం వల్లే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సారథ్యంలోని జేఎంఎం.. మహాఘటబంధన్‌కు స్వస్తి చెప్పిందని, తమ అభ్యర్థులు ఆరుగురిని ఉపసంహరించుకుందని మోదీ గుర్తుచేశారు. గత రెండు దశాబ్దాలుగా ఆర్జేడీ ఏ ఎన్నికల్లోనూ గెల వలేదని, అయినప్పటికీ అహంకారం తగ్గలేదని, జేఎంఎంను కూటమి నుంచి విసిరిపారేసిందని ఎద్దేవా చేశారు. బిహార్‌లో ఆర్జేడీతో 35 ఏళ్లుగా కాంగ్రెస్ అంటకాగుతోందన్నారు. వాళ్లు చివరకు వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీని సైతం స్వార్థ ప్రయోజనాల కోసం తప్పు దారి పట్టించారని అన్నారు. 'వాళ్లు ముందు టిక్కెట్లు అమ్ముకుంటారు. ఆ తర్వాత స్కామ్‌లు చేస్తారు' అని విమర్శలు గుప్పించారు. 243 మంది సభ్యుల బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా నవంబర్ 6,11 తేదీల్లో పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 14న ఫలితాలు వెలువడతాయి.

## అదే తేలితే చర్యలు తప్పవు.. ప్రైవేట్ ట్రావెల్స్‌కు సీఎం వార్నింగ్




**అమరావతి, (రాజధాని వార్తలు):** కర్నూలు బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధి కారులతో సమగ్ర విచారణకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యశాఖకు సూచనలు చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు ముఖ్యమంత్రి ఆదేశిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అన్ని జిల్లాల్లో బస్సుల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖకు ఆర్డర్స్ పాస్ చేశారు సీఎం. ప్రమాదానికి కారణం.. నిర్లక్ష్యమని తేలితే కఠిన చర్యలు తప్పవని ట్రావెల్స్ బస్సు యాజమాన్యానికి సీఎం హెచ్చరికలు జారీ చేశారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రాధాన్యత, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం త్వరితగతిన అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షిస్తున్నారని సీఎంకు తెలియజేశారు మంత్రి. అలాగే ప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర ప్రజల భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని సీఎం చంద్రబాబు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్స్‌తో 1500 కోట్ల నష్టం.. హైదరాబాద్‌లో భారీగా బాధితులు!

**ఇంటర్నెట్ డెస్క్:** దేశ వ్యాప్తంగా గత ఆరు నెలల్లో భారీగా ఇన్వెస్ట్‌మెంట్ స్కామ్స్ వెలుగులోకి వచ్చినట్టు హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడైంది. బాధితులు ఏకంగా రూ.1500 కోట్ల మేర నష్టపోయినట్టు తేలింది. దేశంలోని ప్రధాన నగరాలైన బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్ నగరాల్లో ఈ మోసాలు ఎక్కువగా వెలుగు చూశాయని పేర్కొంది. 65 శాతం కేసులు ఈ మూడు నగరాల్లోనే ఉన్నట్టు తెలిపింది. బాధితుల్లో 30 ఏళ్లు మొదలు 60 ఏళ్ల వయసున్న వారు ఉన్నారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఈ నివేదికను రూపొందించింది. పెట్టుబడి పేరిట జరుగుతున్న ఈ స్కామ్‌ల కారణంగా బెంగళూరుకు అత్యధిక నష్టం జరిగింది. మొత్తం నష్టాల్లో బెంగళూరు వాటా ఏకంగా 26.38 శాతం. అమాయక ఇన్వెస్టర్లను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లకు ఈ నగరాలు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఉద్యోగ వ్యాపారాలు చేసే వారే ఎక్కువగా ఈ నేరాల బారిన పడుతున్నారు. బాధితుల్లో 76 శాతం మంది వయసు 30 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్నట్టు ఈ నివేదికలో తేలింది. అధిక ఆదాయం పొందాలన్న బాధితుల తపనను నిందితులు ఆసరగా చేసుకుంటున్న వైనం ఈ గణాంకాల్లో కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. సీనియర్ సిటిజన్లు కూడా ఈ స్కామ్స్ బారిన పడతారు. వీరి వాటా 8.62 శాతంగా ఉంది. కొన్ని ఘటనల్లో బాధితులు సగటున రూ. 51.38 లక్షల మేర నష్టపోయారు. తలసరి నష్టంలో ఢిల్లీ మొదటి స్థానంలో ఉంది. అక్కడి బాధితులు సగటున రూ.8 లక్షలు నష్టపోయారు. టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా జరిగే మోసాల వాటా ఏకంగా 20 శాతంగా ఉంది. ఈ వేదికల్లోని ఎన్‌క్రిప్షన్ విధానం, సులువుగా గ్రూపులు క్రియేట్ చేసే వీలుండటం కారణంగా నేరగాళ్లు ఎక్కువగా వీటినే తమ స్కామ్స్ కోసం ఎంచుకుంటున్నారు. ఈ మోసాలకు లింక్డ్ఇన్, ట్విట్టర్ ఎక్కువగా వినియోగించకపోవడం మరో ఆసక్తికర అంశం. డైరెక్ట్ మేసేజీల ద్వారా నేరగాళ్లు అమాయకులను టార్గెట్ చేస్తున్నట్టు ఈ నివేదికలో తేలింది.





రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాస గృహం నిర్మాణ చిత్రం,
ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్

## సర్వీసు ఇనాం భూములపై 45 రోజుల్లో నివేదిక

**- భూ కేటాయింపులపై సమగ్ర విధానం తెస్తాం - లీగల్ అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు - వచ్చే జూన్ నాటికి అన్ని టిడ్కో ఇళ్లు పూర్తి - మంత్రులు అనగాని, నారాయణ, పార్థసారధి వెల్లడి**

అమరావతి, (రాజధాని వార్తలు): సర్వీసు ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి సమగ్ర విధానం తేవాలని నిర్ణయించినట్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సర్వీసు ఇనాం భూములపై పూర్తి స్థాయి అధ్యయనం కోసం దేవాదాయశాఖ అధికారులు, తాహశీల్దార్లతో కమిటీలు వేస్తున్నామని, ఈ కమిటీలు సమగ్ర అధ్యయనం చేసి 45 రోజుల్లోగా నివేదిక ఇస్తాయని చెప్పారు. ఆ నివేదకను చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయాలు తీసుకొని సర్వీసు ఇనాం భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం జరగగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన అందరికీ ఇళ్లు పై ఏర్పాటైన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, కె.పార్థసారథి పాల్గొన్నారు. అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ అనేక పర్యటనలు చేస్తూ రాత్రింబవళ్లు కష్టపడి రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తున్నారని, ఈ నేపథ్యంలో పరిశ్రమలకు, ఇతర అవసరాలకు భూముల కేటాయింపుపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని నిర్ణయించామని, దీనిపై సమావేశంలో చర్చించామని, త్వరలోనే విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల సమస్యపై కూడా చర్చించామని, ఆ భూముల విధానాన్ని మరింత సరళతరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. వక్ఫ్ భూమలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. అనంతరం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ 2014-19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు ఏడు లక్షల టిడ్కో ఇళ్లను అన్ని సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఐదు లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతినిచ్చి గ్రౌండ్ చేస్తే గత వైసీపీ ప్రభుత్వం 2 లక్షల 60 వేలకు కుదించి వాటిని కూడా పూర్తి చేయలేదని చెప్పారు. అయితే



ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు న్యాయం చేయాలని చెప్పారని, గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకూడదని అన్నారని, మొత్తం రెండు లక్షల 60 వేల టిడ్కో ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారని చెప్పారు. అందుకు గాను తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. అనంతరం సమాచార, పౌరసరఫరాల సంబంధాలు, హౌసింగ్ శాఖా మంత్రి కె.పార్థసారధి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనతో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. అర్హులైన వారందరికీ రెండు సెంట్లు, మూడు సెంట్లు స్థలాలు ఎలా ఇవ్వాలో ఈ సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం సెంటు, సెంటున్నర స్థలాలు మాత్రమే ఇచ్చారని అన్నారు. అయితే కొన్ని లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరగని చోట లబ్దిదారులను ఒప్పించి వారికి రెండు, మూడు సెంట్లు స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో లీగల్‌గా ఉన్న అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకుంటున్నామని, అందు కోసం అడ్వకేట్ జనరల్ అభిప్రాయం అడుగుతామని, ఆయన తన అభిప్రాయాన్ని ఇవ్వగానే ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి తదుపరి సమావేశంలో ఒక నిర్ణయం తీసుకునే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కూడా కట్టించి ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పార్థసారధి చెప్పారు.

## సీఐఐ సదస్సుకు రండి.. పారిశ్రామికవేత్తలకు లోకేష్ ఆహ్వానం



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఆరవ రోజుకు చేరుకుంది. రాష్ట్రానికి పెద్ద మొత్తంలో పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఆస్ట్రేలియాలో మంత్రి పర్యటన కొనసాగుతోంది. ఇప్పటికే వివిధ సంస్థలు, యూనివర్సిటీ ప్రతినిధులతో లోకేష్ సమావేశమయ్యారు. తాజాగా మెల్‌బోర్న్‌లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖలో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సుకు రావాల్సిందిగా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. 'మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్' అంటూ పేర్కొన్నారు. ఏపీకి 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే అని చెప్పుకొచ్చారు. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటోందని మంత్రి వెల్లడించారు. అంతకు ముందు ఆస్ట్రేడ్ ఎగ్జిక్యూటివ్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ పాల్గొని ప్రసంగించారు. 2047 నాటికి గ్లోబల్ ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని అన్నారు. $2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు వేస్తోందని తెలిపారు. జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

# సామర్లకోటలో డిఆర్ఎం ఆకస్మిక తనిఖీలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట రైల్వే స్టేషన్లో సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా గురువారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. స్థానిక సిసిటి స్టేషన్, ఆర్ డబ్ల్యూ కార్యాలయం పరిశీలన నిమిత్తం విచ్చేసిన సందర్భంగా స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ డి ఆర్ ఎంకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వర్షంలో సైతం డిఆర్ఎం స్టేషన్లో తనిఖీలు చేపట్టారు. సిసిటి స్టేషన్లో, ప్లాట్ఫారాలను, ఇటీవల భారీ వర్షానికి ట్రాకులు మునిగిపోయిన సందర్భాన్ని బట్టి రైలు ట్రాకులను ఆయన పరిశీలించి ట్రాక్ నిర్వహణ, పారిశుధ్యం, సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే యార్డు ను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. వర్షం పడుతున్నా కాలి నడకన ఆయన పరిశీలన జరిపారు. ఈ తనిఖీలో డివిజన్ పరిధిలోని పలు సెక్షన్ల అధికారులు, ఏడిఇ ఎన్ కె ప్రభాకర్, స్థానిక సెక్షన్ల అధికారులు, జిఆర్పీ, ఆర్పీఎఫ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు

## - వర్షంలోనూ భక్తుల దర్శనం



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పంచారామ క్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర ఆలయంలో పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీకమాసం రెండో రోజు పూజల్లో భాగంగా గురువారం ఏపీఈపి డిసిఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ టి వెంకట సూర్య ప్రకాశరావు విశాఖపట్టణం నుంచి, సౌత్ సెంట్రల్ రైల్వే కన్స్ట్రక్షన్స్ చీఫ్ ఇంజనీర్ వి సూర్యనారాయణ కుటుంబం సికింద్రాబాద్ నుంచి విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ అధికారి బళ్ళ నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీశ్ మోహన్ల ఆధ్వర్యంలో ఆలయ మర్యాదల చొప్పున ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు భీమేశ్వర స్వామిని, బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వారికి ఆలయ నంది మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం అందజేసారు. అనంతరం ఆలయ అధికారి వారికి స్వామివారి ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, దేవ స్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్తీక మాస పూజల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. వర్షం వస్తున్నా స్వామివారి దర్శనం భక్తులు కొనసాగించారు.

# త్వరలో కొత్తపేటలో అన్న క్యాంటీన్ ప్రారంభం

## - 5 రూపాయలకే అన్నార్తుల ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్‌లు






**కొత్తపేట, (రాజధాని వార్తలు):** ఐదు రూపాయలకే ఆకలిని తీర్చే అన్న క్యాంటీన్ కొత్తపేటలో త్వరలో ప్రారంభం కాబోతోంది. ఇది అన్నార్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్‌లను ప్రధాన పట్టణ కేంద్రాలలో ప్రారంభించారు. నియోజవర్గాల వారీగా అంచలంచలుగా విస్తరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ ఆనాడు తెలియజేశారు. అన్న క్యాంటీన్ అవసరాన్ని గుర్తించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవ తీసుకుని కొత్తపేటలో ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టారు. స్థల సేకరణ చేపట్టి నిధులు మంజూరుకు కృషి చేశారు. దాని ఫలితంగా కొత్తపేటలో త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభం కాబోతోంది. ఇటీవల ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్యాంటీన్ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులో తీసుకు రావాల్సిందిగా కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చారు. కొత్తపేటలో ముఖ్య కూడలిలో అన్న క్యాంటీన్ నిర్మించడం వలన విశేష ఆదరణ కలుగుతుందని పేర్కొనవచ్చు. ఇటు ప్రభుత్వ ఆసుపత్రికి సబ్ రిజిస్టర్ ఆఫీస్‌కు పూర్వపు ఎమ్మార్వో ఆఫీస్ దగ్గరగా రైతు బజార్ పక్కన బస్టాండ్ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్ నిర్మిస్తున్నారు. అందరికీ అందుబాటులో నిర్మించడం అన్నార్తులకు ఎంతో ప్రయోజనకరం కానుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుండి వివిధ పనులపై మండల కేంద్రం కొత్తపేట వచ్చే ప్రజలకు భోజన సమయంలో ఆకలి తీర్చే అక్షయ పాత్రగా నిలుస్తుందని హర్షిస్తూ మంచి స్థలాన్ని ఎన్నుకుని అన్న క్యాంటీన్ నిర్మిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మరియు కూటమి ప్రభుత్వాన్ని కొత్తపేట నియోజకవర్గ ప్రజానీకం ప్రసంశిస్తున్నారు. అన్ని పనులు పూర్తిచేసి త్వరలో ఈ అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్యే సత్యానందరావు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాబోతున్నారు.

# సాయి గౌతమ్ స్కూల్ విద్యార్థుల సత్తా



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సాయి గౌతమి హై స్కూల్ క్రీడా మైదానంలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో సాయి గౌతమి స్కూల్ నుంచి ప్రాతినిధ్యం వహిం చిన క్రీడాకారులు, క్రీడాకారినిలు తమ సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి వివిధ క్రీడలకు సంబంధించి మండల జట్లకు ఎంపికయ్యారు. అండర్ - 14, అండర్ - 17 విభాగాలకు సంబంధించిన కోకో, కబడ్డీ, చెస్, యోగ, బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి, త్వరలో జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో తమ క్రీడాకారులు పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్. నాయుడు బుధవారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అభినందనలు తెలిపారు.

# పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో కమిషనర్ భేటి



**ఖమ్మం, (రాజధాని వార్తలు):** పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో పోలీస్ కమిషనర బేటి అయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు వారి సమస్యలను వివరించారు. ప్రధానంగా ప్రభుత్వ కేటీయించిన ఇంటి స్థలం సంబంధించి సమస్యలపై విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన పోలీస్ కమిషనర్ ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పక్రీయ మొదలుపెట్టారని, త్వరలోనే సమస్యకు పరిష్కరం లభిస్తుందని తెలిపారు.

# రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అవినీతిపై ఎమ్మెల్యే కోటంరెడ్డి గరం గరం

**- కోటి 50 లక్షలు ఇరిగేషన్ స్థలాన్ని గుట్టు చప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్ట్రార్ - ఎమ్మెల్యే కోటంరెడ్డికి పలువురు ఫిర్యాదులు - రిజిస్ట్రేషన్ కోసం వెళితే లంచాల కోసం జలగల్లా పీడిస్తున్నారని ఆవేదన - ముఖ్యంగా మద్రాసు బస్టాండ్, స్టోన్ హౌస్ పేట కార్యాలయాలకు సంబంధించి పలు ఫిర్యాదులు - కొన్ని అక్రమ రిజిస్ట్రేషన్‌లపై ఎమ్మెల్యేకు వరుస ఫిర్యాదులు - ఈరోజు సాయంత్రం 6 గంటలకు కోటంరెడ్డి.. జిల్లా రిజిస్ట్రార్‌తో సమీక్ష సమావేశం**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కోటి యాభై లక్షల ఇరిగేషన్ స్థలం.. ప్రభుత్వ స్థలాలను కూడా అప్పనంగా రికార్డులను మార్చి అక్రమాలు చేసి తమ కాసుల కక్కుర్తి కోసం రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారుల మాయాజాలం... రిజిస్ట్రేషన్ కోసం జిల్లా కేంద్రంలో ఉన్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళితే జలగ పీడిచ్చినట్టు పీడిస్తున్న వైనం..నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి పేద, మధ్యతరగతి ప్రజలు అనేకమంది ఫిర్యాదులు... అయ్యా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఇది పరిస్థితి.. మీరు స్పందించండి... ఒక్క డాక్యుమెంట్ కోసం వేలాది రూపాయలు లంచాలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి.. లేకపోతే అనేక కొర్రీలు వేస్తున్నారు... పేదల ఎమ్మెల్యేగా మీరే న్యాయం చేయాలి అంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని అనేకమంది వేడుకున్నారు. కొన్ని డాక్యుమెంట్ల కోసం లక్షల రూపాయలు కూడా ఇవ్వాల్సిన పరిస్థితి. నెల్లూరు మద్రాస్ బస్టాండ్, స్టోన్ హౌస్ పేట రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సంబంధించి వరుసగా అనేక మంది ఫిర్యాదులు రావడంతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందించారు. పేద మధ్యతరగతి ప్రజలను లంచాల కోసం జలగల్లా పీల్చి చేస్తున్న కొంతమంది అధికారులు సిబ్బంది, వ్యవహారంపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధారాలతో సహా అనేక సమాచారాన్ని సేకరించారు. ప్రభుత్వ స్థలాలను అప్పనంగా రికార్డులను తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేస్తున్న ఘటనలకు సంబంధించి ఫిర్యాదులు కూడా ఆయనకు ఉన్నాయి. దీంతో జిల్లా రిజిస్ట్రార్‌ను ఈరోజు సాయంత్రం 6 గంటలకు తన కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశానికి హాజరుకావాలని కోటంరెడ్డి సమాచారం అందించారు. మొత్తానికి నెల్లూరు మద్రాస్ బస్టాండ్, స్టోన్ హౌస్ పేట రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను సమీక్ష సమావేశంలో కోటంరెడ్డి ఆధారాలతో సహా నిలదీసి హెచ్చరిక జారీ చేయనున్నారు.

# పారిశుధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా 38వ డివిజన్‌లో పర్యటించిన కమిషనర్ వై.ఓ.నందన్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానికంగా అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు సంబంధిత విభాగం అధికారులతో కమిషనర్ ప్రత్యక్షంగా పాల్గొని విచారించారు. అర్జీదారులకు శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ప్రాంగణంలో పరిశుభ్రతను కమిషనర్ పరిశీలించారు. డివిజన్ వ్యాప్తంగా డ్రైను కాలువలలో వరద నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా తొలగించేలా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


# ప్రతి ఒక్కరూ కోటి సంతకాల సేకరణలో భాగస్వామ్యం కావాలి





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** కోటి సంతకాల సేకరణ లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నియోజకవర్గం వైకాపా ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు కుమార్తె మజ్జి సిరమ్మ పిలుపునిచ్చారు. జీవిఎంసీ 3వ వార్డుకు సంబంధించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వార్డు అధ్యక్షులు అల్లిపిల్లి నరసింగరావు ఆధ్వర్యంలో భీమిలి పాత బస్టాండ్ వద్ద బుధవారం నిర్వహించగా మజ్జి సిరమ్మ పాల్గొన్నారు.
రాష్ట్రంలో పేదవాడికి విద్య వైద్య అందుబాటులో లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మెడికల్ కాలేజ్ పేద ప్రజలకు ఆరోగ్యానికి జీవనాడి అని వాటిని ప్రైవేట్ పరం చేస్తే పేద వాడికి వైద్యం ఎక్కడ అందుతుందని ఆమె అన్నారు. సంతకాల సేకరణలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కొంత సమయం తర్వాత నియోజకవర్గం ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు ఇదే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భవిష్య త్తులో ప్రతి ఒక్క పేద, మధ్యతరగతి కుటుంబాలు చదవాలన్న వైద్యం చేయించుకోవాలన్నా ప్రైవేటీకరణ అనేది ఆపడం ఒక్కటే మార్గమని జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేటీకరణ ఆపడానికి కోటి సంతకాల సేకరణలో అందరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైలపిల్లి షణ్ముఖరావు, కదిరి ఎల్లాజీ, మైలపల్లి లక్ష్మణరావు, వాసుపల్లి కొండబాబు, ఎర్రయ్య రెడ్డి, ప్రభాకర్ నాయుడు, మధు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : గూడూర్ డిఎస్పీ గీత కుమారి



**గూడూరు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి నెల్లూరు జిల్లా, తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని గూడూరు డిఎస్పి గీతా కుమారి తెలియజేశారు. వారు మాట్లాడుతూ వచ్చే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి అని సూచించారు. పాడుబడిన భవనాలు, హోర్డింగ్ బోర్డులు, చెట్లు లేదా విద్యుత్ తీగల దగ్గర ఉండవద్దు. వాగులు, వంకలు, చెరువులు, నదులు మరియు లోతైన నీటి గుంటల వద్దకు వెళ్లవద్దు అని సూచించారు. అవసరంలేకుండా బయటకు రాకండి రోడ్లపై నీటి ప్రవాహం ఉన్నచోట ప్రయాణించవద్దు. వాగులు, కాలువలు దాటేటప్పుడు అత్యవసరం అయినా వాహనాలతో దాటవద్దు. రీల్స్ లేదా సెల్ఫీలు తీసుకోవద్దు. తల్లిదండ్రులు పిల్లలను నీటి ప్రాంతాల వద్ద ఆడనీయకుండా జాగ్రత్త వహించాలి. నీటి మట్టం అకస్మాత్తుగా పెరగవచ్చు. చెట్లు కూలిపోవడం, విద్యుత్ తీగలు తెగిపోవడం లేదా వాగులు పొంగిపోవడం వంటి ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం కోసం డయల్ 112 సేవను వినియోగించుకోండి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మీ భద్రత, మీ కుటుంబ భద్రత కోసం పోలీస్ సూచనలు తప్పక పాటించండి" అని గూడూరు ఎస్డీపీవో గీత కుమారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా రేబాల వారి వీధిలో కార్తీకమాస ప్రవచనములు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరులో స్టోన్ హౌస్ పేటలోని రేబాలవారి వీధిలో ఉన్న రాజ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో పద్యసారస్వత పరిషత్ నెల్లూరుశాఖ వారి ఆధ్వర్యంలో 23 వ తేదినుండి 29 వ తేది వరకు కార్తీకమాస ప్రవచనములు ప్రారంభమైనాయి. సాయంకాలం 6 గంటలనుండి 8 గంటల వరకు జరుగుచున్న ఈ ప్రవచనములలో మొదటిరోజు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు కార్తీకమాస విశిష్టతను వివరించారు.

కార్తీకమాసంలో విష్ణు భగవానుని, పరమేశ్వరుని భక్తులు భక్తిప్రపత్తులతో పూజిస్తా రని, అందువలన ఈ మాసం హరిహరుల మాసమని, కార్తీకమా సంతో సమానమైన మాసం మరొకటి లేదని, అందువలన "ఈ కార్తీక మాసం అనే ఆర్యోక్తి ఏర్పడినదని ఈ మాసంలో కృత్తికా నక్షత్రం చంద్రునితో కలసి ఉంటున్నందున దీనిని కార్తీకమా సము అని పిలుస్తారని, ఈ మాసంలో దీపారాధన విశేష ఫలితాన్ని ఇస్తుందని, ఆకాశదీపము, భగినీహస్త భోజనము, నాగుల చవితి, కార్తీక సోమవారాలు శుద్ధ ఏకాదశి..ఉత్థాన ఏకాదశి, శుద్ధ ద్వాదశి, చిలుకద్వాదశి కార్తీక పౌర్ణమి ధాత్రీపూజ, వనభోజనము, మొదలైన అనేక పండుగలతో ఈ కార్తీకమాసం నిండి ఉంటుందని వక్త వివరించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్య నాయుడు తంగిరాల నరసింహకుమార్ నేటి సభకు సభాపోషకులుగా వ్యవహరించారు.

అపార్ట్ మెంట్ కమిటీ అధ్యక్షులు సరాబు వెంకటేశ్వర్లు వేదికను అలంకరిం చారు. సూరం చంద్రశేఖరం సభానిర్వహణ నిర్వహించారు. పోల వరపు లక్ష్మీనరసింహారావు పద్య సారస్వత పరిషత్ కార్యక్రమా లను వివరించారు ఈ కార్యక్రమంలో శతావధాని కొండపి మురళీకృష్ణ, కోట రాజశేఖర్ కోట రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. పెద్దలు చీమకుర్తి వెంకటేశ్వరరావు ని ఘనంగా సత్కరించారు.

# కారుణ్య నియామక ఉత్తర్వులను అందించిన కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కారుణ్య నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అందించారు. గురువారం కలెక్టర్ వారి చాంబర్‌లో షేక్ సంషీర్ అనే యువకుడిని సహకార శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ కలెక్టర్ కారుణ్య నియామక ఉత్తర్వులను అందించారు. సంషీర్ తండ్రి9 చాన్ బాష ఇరిగేషన్ శాఖలో మ్యాన్ మజ్దూర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించడంతో, కారుణ్య నియామకం ద్వారా సంషీర్‌కు ప్రభుత్వ ఉద్యోగాన్ని కలెక్టర్ కేటాయించారు. విధుల పట్ల అంకితభావంతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

# పొదలకూరుకు 3085 బస్తాల యూరియా





**పొదలకూరు, (రాజధాని వార్తలు):** రెండో విడతలో ఇంకా యూరియా తెప్పించేందుకు చర్యలు. ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాల యూరియా అందిస్తాం. రైతులు యూరియాను పరిమితంగా వాడాలి. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను కచ్చితంగా పాటించాలి. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసు కుంటాం.

పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్ బాబు ఆధ్వర్యంలో పొదలకూరు మండలం ఆర్.వై పాళెంలో రైతులకు యూరియా పంపిణీ సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి.

# మూలస్థానేశ్వరాలయంలో కార్తీక మాసోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిద్దాం

## - నాలుగు కార్తీక సోమవారాలతో పాటు కోటి సోమవారం, కార్తీక పౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు : నెల్లూరు ఆర్డీవో అనూష



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పరమశివునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష అధికారులకు సూచించారు. గురువారం ఉదయం మూలాపేట లోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవ ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆర్‌డివో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా చేపట్టవలసిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆర్‌డివో అనూష మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభమైందని, నవంబరు నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాలను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలన్నారు. ఈనెల 27న మొదటి కార్తీక సోమవారం, వచ్చేనెల 3న రెండవ కార్తీకసోమవారం, 10న మూడవ కార్తీకసోమవారం, 17న నాల్గవ కార్తీకసోమవారం నాలుగు కార్తీక సోమవారాలతో పాటు ఈనెల 30న కోటి సోమవారం, వచ్చేనెల 5న కార్తీక పౌర్ణమి వంటి ప్రత్యేక పర్వదినాల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. శివాలయం వెనుకవైపున పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్నిమాపకశాఖ, విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. అన్నిశాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి కార్తీక మాసోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆర్డీవో పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ప్రధానార్చకులు వందవాశి శివకుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల అవసరాల కోసం అటవీ శాఖ పనిచేయాలి

**- కీలకమైన కండలేరు స్పిల్ వే కాలువల విషయంలో అభ్యంతరాలు తగదు - కండలేరు మూడు గేట్లు ఎత్తితే అనేక గ్రామాలు ప్రమాదంలో పడతాయి - సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి రూ.95 కోట్లు మంజూరు చేయాలని కోరుతాం - వైసీపీలో హయాంలో కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యత..అత్యవసర పనులను గాలికొదిలేశారు - కండలేరు జలాశయం వద్ద స్పిల్ వేను పరిశీలించిన సందర్భంగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి -ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డ్యాం ఈఈ గజేంద్రరెడ్డి, ఎడమ కాలువ ఈఈ అనిల్ కుమార్ రెడ్డి, డీఈ శివారెడ్డి, తహసీల్దార్ శివకృష్ణ తదితరులతో వరద పరిస్థితిపై చర్చించిన సోమిరెడ్డి - స్పిల్ వే వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ హిమాన్షు శుక్లతో ఫోన్ లో చర్చ**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మీడియాతో సోమిరెడ్డి కామెంట్స్. భారీ వర్షాలతో కండలేరు జలాశయం నిండుకుండలా మారింది. స్పిల్ వేలో మూడు గేట్లు ఉన్నాయి...వీటి ద్వారా 50 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసే ఏర్పాటు ఉంది. 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన కండలేరులో ఇప్పటికే నిల్వ 60 టీఎంసీలు దాటింది. పరివాహక ప్రాంతంలో భారీవర్షాలు కొనసాగితే స్పిల్ వే గేట్లు తెరవక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. గేట్లు తెరిస్తే వరద జలాలు ఇక్కడి నుంచి 14 కిలోమీటర్లు మేర ప్రవహించి దేగపూడి వద్ద కండలేరు వాగులో కలవాలి. స్పిల్ వే దిగువ ప్రాంతంలో 560 మీటర్ల మేర అటవీ భూమి ఉందని కాలువ తవ్వేందుకు అటవీ శాఖ అభ్యంతరం చెబుతోంది. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా వరద నీరు సాఫీగా వెళ్లి కండలేరు వాగులో కలిసేందుకు కొత్తగా రూ.95 కోట్లతో పనులు చేపట్టాల్సి వుంది. ఇది చాలా అత్యవసరమైన పని..వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కీలకమైన స్పిల్ వే కాలువల పనులతో పాటు అటవీ అనుమతుల సాధనను విస్మరించి కండలేరు ఎడమ కాలువ లైనింగ్ చేయించారు. కండలేరు ఎడమ కాలువకు లైనింగ్ చేయించమని ఏ రైతులు అడిగారు..మొదటి ప్రాధాన్యత స్పిల్ వే వద్ద కాలువల తవ్వకానికి ఇవ్వాలి కదా. నిన్న పెంచలకోన ప్రాంతంలో భారీ వర్షాలు కొనసాగివుంటే పరిస్థితి ఏంది..ఎన్ని గ్రామాలు ప్రమాదానికి గురవుతాయో తెలుసా. ప్రజలకు ఏది అవసరమో తెలుసుకోకుండా కమీషన్లు వచ్చే పనులకే ప్రాధాన్యమివ్వడం దుర్మార్గం. వైసీపీ హయాంలో ఇరిగేషన్, వ్యవసాయంతో పాటు కీలకమైన శాఖలను మూతేశారు..వారికి డబ్బులు వచ్చే శాఖలకే పెద్దపీట వేశారు. ప్రస్తుత పరిస్థితి జిల్లా కలెక్టర్ కూడా అర్థం చేసుకున్నారు...రూ.95 కోట్ల ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తాను. అటవీశాఖకు 560 మీటర్ల మేర భూమికి ప్రత్యామ్నాయంగా ఉదయగిరిలో భూములు చూపించారు. ప్రజావసరాల నేపథ్యంలో అటవీశాఖ కొన్ని వెసులబాట్లు ఇవ్వాలి. ప్రతి విషయంలో నియమ, నిబంధనల పేరుతో అడ్డు తగలడం సరికాదు. అడవిలో ఎర్రచందనం చెట్లను నరికేవారిని పట్టుకుని జైళ్లలో వేయండి. కానీ రైతులు, ప్రజల ప్రయోజనాల విషయంలో మాత్రం సానుకూలంగా స్పందించాలి. స్పిల్ వే వద్ద 560 మీటర్లలో కాలువ తవ్వితే అడవి మూతపడిపోతుందా. కాలువ తవ్వితే నీళ్లు సాఫీగా దిగువకు వెళ్లిపోతాయి..లేదంటే అటవీ ప్రాంతం కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడటమే గాక, రైతుల పొలాలు కూడా మునిగిపోయే పరిస్థితి. పులికల్లు, పర్వతాపురం, అంకుపల్లి, వావింటపర్తి తదితర గ్రామాలు ప్రమాదంలో పడతాయి. డీఎఫ్ఓల నుంచి రాష్ట్ర ఉన్నతాధికారుల వరకు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని కాలువ తవ్వకానికి అనుమతులు ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ కూడా ప్రత్యేక దృష్టి పెట్టి అటవీ అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికి ఇక్కడి ప్రజల అవసరాలను సీఎంకు వివరించి రూ.95 కోట్లు మంజూరు చేయిస్తాం.

# రహదారుల్లో వర్షపు నీరు తొలగించాలి : కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నెల్లూరు నుండి పొట్టేపాళెంకు వెళ్లే ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలవకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకునేందుకు నెల్లూరు రూరల్ మండల ఎం.పీ.డీ.ఓ., మున్సిపల్ కార్పొరేషన్ మరియు ఆర్ & బి అధికారులతో కలసి పనులను పరిశీలించిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. నెల్లూరు శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మ దేవస్థానం నుండి పొట్టేపాలెం మీదుగా వెళ్లే ప్రధాన రహదారిపై ఇటీవల కురిసిన వర్షానికి నిలిచి ఉన్న వర్షపు నీరును త్వరితగతిన తొలగించేందుకు చర్యలు చేపట్టవలసిందిగా అధికారులకు సూచించిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. ఈ సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చేపట్టవలసిన చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయవలసిందిగా అధికారులను సూచించిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

పై కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టిడిపి నాయకులు ఇందుపూరు అచ్యుత్ రెడ్డి,నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, ఆర్ & బి డి.ఇ., మునిసిపల్ కార్పొరేషన్ ఇ.ఇ, డి.ఇ, ఏ.ఇ, పొట్టేపాళెం పంచాయత్ సెక్రటరీ, వి.ఆర్.ఓ., కో క్లస్టర్ విష్ణు ప్రియ, 41వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు ఉచ్చురు సురేష్,టిడిపి నాయకులు పూల సుబ్రమణ్యం, సుతారం సురేష్, శివశేషాద్రి, కమలాకర్, గఫోర్, ఫిరోజ్, అద్దంకి కృష్ణ, కెపిఎన్ ప్రసాద్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సంస్కృతి శాపమా వరమా

సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడటం మనకు అసాధ్యం. భూమ్మీద ఉన్నంత వరకూ గురుత్వాకర్షణను తప్పించుకోవటం ఎలా సాధ్యపడదో సంస్కృతి విషయంలోనూ మన పరిస్థితి అంతే! మనల్ని బంధించేది గురుత్వాకర్షణ శక్తి అని గుర్తించిన తర్వాతే దాన్ని అధిగమించే నియమాలను కనిపెట్టి అంతరిక్ష విన్యాసాలను చేయగలుగుతున్నాం. ఆకాశ ప్రయాణాలను సాగించగలుగుతున్నాం. అట్లాగే సంస్కృతిలో మంచిచెడులను గుర్తిస్తేనే మంచిని పెంచగలం. చెడుని తుంచగలం. ఒకనాటి పాశ్చాత్య ఆధిపత్యానికి సంస్కృతే కారణమని గట్టిగా వాదించే ఆర్థిక చరిత్రవేత్త జోల్ మోకియర్ ఈసారి నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. పాశ్చాత్య సంస్కృతి ఒక్క దానికే ఆ శక్తి ఎట్లా వచ్చింది? మిగతా వాటిల్లో అదెందుకు లేదు? మోకియర్ ప్రతిపాదనల లోతుల్లోకి వెళితేనే నిజం కొంత తెలుస్తుంది. ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని ప్రతిపాదించటం విజ్ఞానశాస్త్ర గతినే మార్చేసింది. ఇది అందరికీ తెలిసిందే. న్యూటన్ ముందూ తర్వాతా ఎందరో మహామహులు తమ ప్రయోగాలు, పరిశీలనలు ఆధారంగా విశ్వం స్వరూప, స్వభావాలను వర్ణించి మన ఆలోచనల్లో సమూల మార్పులు తెచ్చారు. అనుభవ జ్ఞానం ఆధారంగానే మన అభిప్రాయాలను ఏర్పరుచుకోవాలనీ నిర్దేశించారు. పెద్దలు చెప్పారనో, పవిత్ర గ్రంథాలు పేర్కొన్నాయనో భావిస్తూ పరిశీలనాశక్తిని కొండెక్కిస్తే మన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని మన అవసరాలకు అనుగుణంగా సమర్థంగా ఉపయోగించుకోలేమనీ తేల్చి చెప్పారు. మనుషులు పారిశ్రామిక విప్లవంలోకి అడుగు పెట్టటానికి ప్రయోగ - పరిశీలన ఆధార ఆలోచనలే ప్రధాన కారణమయ్యాయి. మరి ఈ ఆలోచనలు యూరపులోనే పరిపక్వతను పొంది, అక్కడే పారిశ్రామిక విప్లవానికి ఎందుకు దారితీశాయి? వేల సంవత్సరాల నాగరికతలకు నిలయాలైన ఆసియా, ఆఫ్రికా ఖండాలు ఆ పరిణామానికి తొలుత ఎందుకు దూరంగా ఉండిపోయాయి? కారణం ఎక్కడ ఉంది? ఆ లోపానికి బాధ్యులెవరు? ఆసియా, ఆఫ్రికాలకు కాలం కలిసి రాలేదా? ప్రకృతిలోని అసమానతలే అందుకు దోహదం చేశాయా? సంప్రదాయాలూ, సంస్కృతులూ కొత్త ఆలోచనలకు ప్రతిబంధకాలయ్యాయా? ఇవన్నీ కీలక ప్రశ్నలు. అన్నీ పారిశ్రామిక విప్లవం చుట్టూ తిరిగేవే. పారిశ్రామిక విప్లవం కొన్ని దేశాలకు ఆధిపత్యాన్ని కట్టబెడితే, కొన్ని దేశాలకు పరాధీనతను ప్రసాదించింది. ధనిక - పేద దేశాలను సృష్టించింది. వలసరాజ్యాలు, సామ్రాజ్యాల ఏర్పాటుకు దారి తీసింది. ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హౌయిట్‌లు పరిశోధించారు. మనం సంస్కృతి అనే పదాన్ని తరచూ చాలా పరిమిత అర్థంలో వాడతాం. సామాజికశాస్త్రాల్లో దానికి చాలా విస్తృతార్థం ఉంది. సంప్రదాయాలు, పూజలు, ఆరాధనా పద్ధతులు, కుటుంబ సంబంధాలు, మంచీచెడులు, ధర్మాధర్మాలు, నైతిక ప్రవర్తనలు, బాధ్యతలు లాంటివన్నీ సంస్కృతిలో భాగమే. కానీ వీటన్నిటికంటే మించింది వివేచనాశక్తి. హేతుబద్ధంగా ఆలోచించగలిగే తత్వం. కాలక్రమంలో సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు ముందు కాళ్లకు బంధనాలుగా మారతాయి. వాటిని తొలగించుకునే శక్తి కూడా సంస్కృతిలో భాగంగానే మనుషులకు లభించాలి. అలా లభించాలంటే వివేచనాశక్తి, హేతుబద్ధ ఆలోచనలకు సంస్కృతిలో ప్రాధాన్యత ఏర్పడాలి. ముఖ్యంగా సమాజంలో పై మెట్టులో ఉన్న వర్గాలు సంస్కృతిలో ఆ మేరకు సంస్కరణలకు మార్గాలు తెరవాలి. అట్లా యూరపులో కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరవబట్టే పారిశ్రామిక విప్లవం సాధ్యమైందని జోల్‌మోకియర్ ప్రతిపాదించారు. వలస దేశాలను దోచుకోవటం, ఆఫ్రికా వాసులను బానిసలుగా అమెరికా ఖండానికి తీసుకువెళ్లటం, అక్కడి నుంచి బంగారం, వెండి లోహాలను కొల్లగొట్టటం, బలప్రయోగంతో ఆసియా - ఆఫ్రికా వ్యాపారస్థులను లొంగదీసుకోవటం, అతితక్కువ ధరలకు ముడిసరుకులను తరలించుకుపోవటం, రైతుల చేతుల్లో నుంచి భూములను తొలగించి వారిని కార్మికులుగా మారేలా చేయటం, బ్రిటన్‌కు భూమిపైపొరల్లో బొగ్గు తేలికగా లభించటంలాంటివన్నీ కలగలిసి పారిశ్రామిక విప్లవానికీ, ఆ తర్వాత యూరోపు ఆధిపత్యానికీ దోహదం చేశాయనీ చెప్పే వాదనలను తోసిపుచ్చుతూ జోల్‌మోకియర్ చేసిన ప్రతిపాదనలు ఆర్థిక చరిత్రకారుల్లో ఇప్పటికీ చర్చలను రగుల్చుతూనే ఉన్నాయి. ప్రయోగాలకూ, పరిశీలనలకూ ప్రాధాన్యమిచ్చే సంస్కృతి యూరపులో కొలంబస్ సాహసిక నౌకాయానాల కాలం నుంచి మొదలై ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే నాటికి గట్టిగా స్థిరపడిందనీ, 18వ శతాబ్దంలో అదింకా బలపడి పారిశ్రామిక విప్లవానికి కావాల్సిన మేధో భూమికను తయారుచేసిందన్నదే మోకియర్ ప్రతిపాదనల్లో ప్రధానమైంది. ఆ సంస్కృతి వల్లే అనేక రంగాల్లో విజ్ఞానం పోగుపడి, యంత్రాల తయారీకి దారి తీశాయని చెప్పారు. దేశాల తలరాతలను సంస్కృతే మార్చిందనీ, దేశాల మధ్య ఆర్థిక అంతరాల అన్వేషణకు సంస్కృతిలోకే తొంగిచూడాలని చెబుతూ మోకియర్ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. మోకియర్ దృష్టి నుంచి చూస్తే సొంత సంస్కృతి సర్వశ్రేష్ఠమని గుడ్డిగా భావించే ఏ సమాజమూ ముందుకు వెళ్లలేదు.

# “హాలో గ్రామ్ స్కాన్” తో కత్తీ మద్యానికి ఫుల్ స్టాప్

**- నకిలీ మద్యాన్ని అరికట్టే హలో గ్రామ్ స్కాన్ గూర్చి వినియోగదారులకి తెలియ చేయాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో మోహన్ వైన్స్‌కు వచ్చాను - “సురక్ష” యాప్ ద్వారా మద్యం బాటిల్లపై గల “హెూలోగ్రామ్”ను స్కాన్ చేసి మద్యం బాటిల్ ఎక్కడ తయారైంది, తేదీ, ఏ గవర్నమెంట్ డిపోకి వచ్చినది, ఆ డిపో నుంచి ఏ షాపులో అమ్మబడుతుందో తెలుసుకోవచ్చు : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం దిగువ వీధిలో గల మోహన్ వైన్స్‌ను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, సెర్ప్, ఎన్.ఆర్.ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఏ.పీ ఎక్సైజ్ సురక్ష అనే మొబైల్ యాప్ కల్తీ మద్యానికి చెక్ పెడుతుందని, హాలో గ్రామ్ స్కాన్‌తో నాసిరకం మద్యానికి ఫుల్ స్టాప్ పడుతుందని అన్నారు. మోహన్ వైన్స్ షాపును ఆకస్మికంగా సందర్శించి, అక్కడ మద్యం నిల్వలను మంత్రి శ్రీనివాస్ తనిఖీ చేశారు. మద్యం నాణ్యతను పరిశీలించారు. నకిలీ మద్యాన్ని అరికట్టే హాలో గ్రామ్ స్కాన్ గూర్చి ప్రజలకు తెలియ చేయాలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఇక్కడకు రావడం జరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విలేకరులతో అన్నారు. సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్లపై గల హెూలోగ్రామ్‌ను స్కాన్ చేసి మద్యం బాటిల్ ఎక్కడ తయారైంది, తయారైన తేదీ, ఏ గవర్నమెంట్ డిపో కి వచ్చినది, ఆ డిపో నుంచి ఏ షాపులో అమ్మబడుతుందో తెలుసుకోవచ్చునని ఆయన అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కల్తీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో ఈ రకమైన చర్యలకు తమ ప్రభుత్వం ఉపక్రమించిందన్నారు. కల్తీ మద్యంపై ప్రతిపక్ష వైకాపా పార్టీ నాయకులు అనవసరమైన రాద్ధాంతం చేసి ప్రజలకు అపోహాలు కలిగిస్తూ తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేయడం దారుణం అన్నారు. మద్యం వినియోగదారులకు, ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలన్న ప్రయత్నంలోనే తమ ప్రభుత్వం సురక్ష యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. మద్యం వినియోగదారులకు నాణ్యమైన మద్యం అందజేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్మన్నారు. కల్తీ మద్యానికి ఏ ఒక్కరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జనార్ధన్ రావు, ఎస్సై నరేంద్ర కుమార్, మాజీ జడ్పిటిసి మక్కువ శ్రీధర్, వైకుంఠం ప్రదీప్ కుమార్, గేదెల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

# కార్మిక సమస్యలు ప్రభుత్వానికి పట్టవు

**- జిల్లా మహాసభలు విజయవంతం చేయండి**



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కార్మికులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని, వారి సమస్యలు ప్రభుత్వానికి పట్టవని, ఈ అంశంపై చర్చించి పోరాటాల రూపకల్పనకు సిఐటియు మహాసభలు పెద్దాపురంలో నిర్వహిస్తున్నామని వీటిని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి పిలుపునిచ్చారు. ఈ నెల 25, 26 తేదీలల్లో పెద్దాపురంలో జరిగే సిఐటియు కాకినాడ జిల్లా 12వ మహాసభల విజయవంతానికి సిఐటియు విస్తృత సమావేశం గడిగట్ల సత్తిబాబు అధ్యక్షతన పెద్దాపురం యాసలపు సూర్యారావు భవనంలో గురువారం నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిధిగా శేషబాబ్జి హాజరై మాట్లాడారు. కాకినాడ జిల్లాల్లో కార్మికులు అనేక సమస్యలతో బాదపడుతున్నారని ఆయన తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలుచేస్తామని ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి చెబుతున్నా నేటికి ఒక్కరూపాయి కూడా విడుదల చేయకుండా సంక్షేమ బోర్డును పక్కన పడేసిందన్నారు. కనీసం పనులు లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మిడ్డేమిల్, వివోఎ వంటి అనేక మంది స్కీమ్ వర్కర్లకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి నేటికి ఒక్క రూపాయి కూడా వేతనాలు పెంచలేదన్నారు. మున్సిపల్ కార్మికులకు పని భారం పెరుగుతుందని దానిని నివారించడానికి చర్యలు కనపడడం లేదని ఆయన అన్నారు. కాంట్రక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు ఇచ్చే వేతనాలే తక్కువని, అయినా వాటిని కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఫ్యాక్టరీ కార్మికులు పిఎఫ్, ఇఎస్ఐ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సమస్యలన్నింటిపైనా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి మహా సభలో చర్చిస్తామని ఆయన తెలిపారు. అక్టోబర్ 25,26 తేదీలల్లో జరిగే సిఐటియు కాకినాడ జిల్లా 12వ మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు నాయకులు విడుదల చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, సిఐటియు నాయకులు క్రాంతి కుమార్, శ్రీనివాస్, సూరిబాబు, టిఎల్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# అభిషేక టికెట్లపై ఆంక్షలు ఎందుకు...

**- మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు**



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** దక్షిణ కైలాస క్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అభిషేక టికెట్లపై ఆన్లైన్ పేరిట ఆంక్షలు పెట్టడం బాధాకరమని, పవిత్ర కార్తీక మాసంలో ప్రతి భక్తుడు అభిషేక సేవలో పాల్గొనే విధంగా ఆన్లైన్, ఆఫ్ లైన్ లోనూ అభిషేక టికెట్లు జారీ చేసేలా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శివుడు అభిషేక ప్రియుడిగా పురాణాలు పేర్కొంటున్నాయని, పవిత్ర కార్తీక మాసంలో పరమేశ్వరునికి అభిషేకం చేస్తే ఎంతో పుణ్యఫలంగా భక్తులు భావిస్తారని అలాంటి పవిత్ర కార్తీక మాసంలో అభిషేక టికెట్లు భక్తులకు అందరికీ లభించకపోవడం తగదన్నారు. ఆలయంలో అన్ని సేవలు, పూజలు ఆన్లైన్‌లో పెట్టేటప్పుడు కోటి 40 లక్షలు వెచ్చించి ఎందుకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. ఆన్లైన్లోనే సేవలు బుక్ చేసుకున్న ప్పుడు ప్రత్యేకంగా కౌంటర్లు అవసరం లేదు కదా! ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అధికారులు ఇస్తున్న ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిలను పరిగణలోకి తీసుకొని నిర్ణయాలు తీసుకొని ప్రతి భక్తుడు సంతృప్తి చెందే విధంగా కార్యాచరణ ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. స్వామి అమ్మవార్ల అభిషేక టికెట్లు ఒక్కో కాలానికి కేవలం ఇరవై మాత్రమే పెట్టడం, ఆఫ్ లైన్‌లో టికెట్లు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న సామాన్య భక్తులకు ఆన్లైన్ విధానం తెలియకపోవడం, ఆన్లైన్ చేసినట్లు విస్తృత ప్రచారం లేకపోవడం, సామాన్య భక్తులకు ఆన్లైన్ విధానంలో బుక్ చేసుకునే విధానం తెలిసి ఉండాలని, నేటికీ అనేకమంది ఆన్లైన్ విధానంలో బుక్ చేసుకునే అవకాశం లేదని గుర్తు చేశారు. అభిషేక సేవలో సంస్కరణలు తీసుకువచ్చి అధికమంది అభిషేక సేవను తిలకించే విధంగా ఆఫ్ లైన్, ఆన్లైన్లో టికెట్లు జారీ చేస్తూ మూడో కాల అభిషేకాన్ని కూడా పునర్ధరణ చేసి పవిత్ర కార్తీక మాసంలో అధిక మంది భక్తులు వాయు లింగేశ్వరుని అభిషేకాన్ని మనసా వాంఛా తిలకించి దర్శన భాగ్యం పొందే విధంగా చేయాలన్నారు. ప్రధానంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆ కాలం నుంచి వాయు లింగేశ్వరునికి నాలుగు కాలాల్లో అభిషే కాలు నిర్వహిస్తూ భక్తులు అభిషేక ప్రియుడైన పరమేశ్వరునికి రుద్రాభిషేకం చేయించడమే ప్రధానంగా ఉండేదని గుర్తు చేశారు. క్షేత్రం మహత్యం ఆచార వ్యవహారాలు పరిగణలోకి తీసుకొని స్థానిక భక్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఆన్లైన్ విధానం తెలియకుండా అభిషేకం చేసుకునే అవకాశం లేకుండా అసంతృప్తితో వెనక తిరిగిపోయే పరిస్థితి నెలకొంది అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రతిరోజు కౌంటర్ వద్ద అనేక మంది భక్తులు ఆఫ్ లైన్‌లో టికెట్లు లభించక తీవ్ర అసంతృప్తి గురవుతున్నారు అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి స్పందించి రానున్న కార్తీక సోమవారం లోపల నిర్ణయాలు తీసుకొని అభిషేక సేవలు అధిక మంది భక్తులు ఉపయోగించుకునే విధంగా ఆన్లైన్లోనూ, ఆఫ్ లైన్‌లోనూ జారీ చేసి నాలుగు కాలాలలోనూ అభిషేక సేవలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు నోచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# రాయవరం అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం అరకొరా సాయం

**- 15 లక్షల పరిహారం కేవలం కంటితుడుపు చర్యే - కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి - అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ**



**అల్లవరం, (రాజధాని వార్తలు):** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలైన ఘటనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అమలా పురం మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఇంటి పెద్దలను కోల్పోయి అనాథలుగా మారిన కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం ప్రకటించిన రూ.15 లక్షలు కేవలం అరకొర సాయం మాత్రమే నని ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అనురాధ డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు మళ్ళీ జరగకుండా ప్రభుత్వం బాణాసంచా తయారీ కేంద్రాలలో సంబంధిత గోదాముల్లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు పూర్తిగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు.

# “యుక్తదార పోర్టల్” లో ఉపాధి హామీ పనులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** “యుక్తదార పోర్టల్” ద్వారా ఉపాధి హామీ పనులను ఇకపై చేపట్టానున్నామని, దానికి గానూ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళికలో సాంకేతిక పరిజ్ఞానం పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 30 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జాతీయ గ్రామీణా భివృద్ధి శిక్షణ సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. నరేగా సాంకేతిక సహాయకులు, జూనియర్ ఇంజనీర్లకు తొలి బ్యాచ్ శిక్షణను సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ కే ఎన్ వి ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకం పనులన్నీ ఇకపై “యుక్తధార” పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతోనే చేయాలని ఆయన సూచించారు. జిఐఎస్, జిపిఎస్, డ్రోన్ సాంకేతి కలపై ఈ మూడు రోజుల పాటు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణ ద్వారా ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలను మెరుగు పరచుకోవచ్చని ప్రిన్సిపల్ ప్రసాద్ అన్నారు. సామర్లకోటలో 8 బ్యాచ్‌లుగా 320 మందికి ఈ శిక్షణ ఏర్పాటు చేశామని అన్నారు. చీఫ్ ఇన్స్ట్రక్టర్ డి. శ్రీనివాసరావు, డిడివో శర్మ, నరేగా అధ్యాపకులు సాగర్, మంగాలక్ష్మి, సూర్యావతి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన టిఎ, జెఈలు పాల్గొన్నారు.

# పని గంటల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి : సిఐటియు డిమాండ్

**కరప, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచే నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ డిమాండ్ చేశారు. గురువారం కరపలోని భవన నిర్మాణ కార్మికుల భవనంలో మేరీ అధ్యక్షతన సిఐటియు కరప మండల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మలక వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం స్కీమ్ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేసి, వారికి కనీస వేతనం నిర్ధారించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించడంతో పాటు రవాణా, అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనం తరం కరప మండల సిఐటియు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పి. వీరవేణి కన్వీనర్‌గా, కె.సత్య, వీర్రాజు, ఆర్. వెంకటలక్ష్మి కో-కన్వీనర్లుగా ఎంపికయ్యారు. ఎనిమిది మంది సభ్యులతో కూడిన మండల కన్వీనింగ్ కమిటీ మొత్తం 13 మందితో ఏర్పడింది. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, సుధా, అనంతలక్ష్మి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

# 'పౌజీ' భామ ఇంత సైలెంట్ అయితే ఎలా?



హీరోయిన్‌గా ఛాన్స్ వస్తే ఆ సినిమా రిలీజ్ కు ముందే ఆ నటి నెట్టింట ఎతంగా ఫేమస్ అవుతుందో చెప్పాల్సిన పనిలేదు. నటిగా సక్సస్ అవుతుందా? లేదా? అన్నది తర్వాత సంగతి సోషల్ మీడియాలో మాత్రం సక్సెస్ అవ్వడం టార్గెట్‌గా తమని తాము తెలివిగా ప్రమోట్ చేసుకుంటున్నారు. హీరోయిన్ ఛాన్స్ అనే అవకాశాన్ని తెలివిగా ఎన్ క్యాష్ చేసుకుంటున్నారు. స్థానికంగా ఫేమస్ అవుతున్నారు. టాలీవుడ్ ఇప్పుడేం చిన్న పరిశ్రమ కూడా కాదు. పాన్ ఇండియాలోనే ఓ సంచలనం. దేశాలు, ఖండాలు దాటి వరల్డ్ వైడ్ సంచలనం సృష్టించిన పరిశ్రమ. అలాంటి ఇండస్ట్రీలో హీరోయిన్ అవకాశం అంటే గ్రాండ్‌గా భావించి తమని తాము తెలివిగా ప్రమోట్ చేసుకుంటున్నారు. దీంతో తర్వాత చిత్రాల్లో అవకాశాలు ఈజీ అవుతున్నాయి. ఫ్లాప్ ల్లో ఉన్న భామలు కూడా ఇప్పటికీ అవకాశాలు అందుకుంటున్నారు? అంటే కారణం పాపులారిటీ అన్నది ఎంతగా పనికొస్తుందన్నది అర్థం పడుతుంది. కానీ పాన్ ఇండియా సినిమా 'పౌజీ' లో ఛాన్స్ అందుకుని కూడా ఇమాన్వీ సైలెంట్‌గా ఉంటం అన్నది ఆశ్చర్యంగా ఉంది. ప్రభాస్ హీరోగా నటిస్తోన్న చిత్రంలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తోన్న సంగతి తెలిసిందే. ప్రభాస్ కి జోడీగా ఎంపిక చేసే విషయంలో దర్శకుడు హనురాఘవపూడి పెద్ద యుద్ధమే చేసాడు. ఎంతో మంది హీరోయిన్లను..బాలీవుడ్ నటీమణుల్ని ఎంతో మంది పరిశీలించి..టెస్ట్ షూట్ నిర్వహించి ఫైనల్‌గా ఇమాన్వీని ఎంపిక చేసాడు. అధికారికంగా విషయాన్ని వెల్లడించాడు. అందం.. అభినయంతో ఇమాన్వికి సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ కూడా వచ్చింది.

పౌజీ సెట్స్‌కి వెళ్లిన కొన్ని నెలల అనంతరం ఇమాన్వీ ఓ డాన్స్ వీడియో కూడా షేర్ చేసింది. ఆ వీడియోతో తనలో డాన్సింగ్ స్కిల్స్ బయట పడ్డాయి. ఆ తర్వాత మళ్లీ అమ్మడు మరో వీడియో గానీ..ఫోటోలు గానీ షేర్ చేయలేదు. అసలు నెట్టింట ఆమె గురించి చర్చ కూడా జరగలేదు. పౌజీ గురించి అప్ డేట్స్ కూడా ఏవీ లేకపోవడంతో ఇమాన్వీ గురించి కనీసం చర్చకు కూడా రాలేదు. ఇంత పెద్ద ప్రతిష్టాత్మక చిత్రంలో ఛాన్స్ వచ్చిందంటే ఏ నటి అయినా వ్యక్తిగతంగా తనను తాను ప్రమోట్ చేసుకునే పనిలో ఉంటుంది. కానీ అలాంటి ఛాన్స్ తీసుకోకుండా పౌజీ షూటింగ్‌కే పరిమితమైంది. మరి సినిమా రిలీజ్..రిజల్ట్ తర్వాత అవకాశాలు తననే వెతుక్కుంటూ వస్తాయి అన్న నమ్మకంతో కావొచ్చు.

# అఖండ 2 రోర్ టీజర్: సౌండ్ కంట్రోల్ లో పెట్టుకో..




నటసింహం నందమూరి బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను.. ఈ కాంబినేషన్లో వచ్చే కంటెంట్ వచ్చిందంటే బాక్సాఫీస్ దగ్గర ఆ వైబ్రేషన్స్ హై లెవెల్‌లో ఉంటాయి. 'సింహా', 'లెజెండ్', 'అఖండ'.. ఇలా ప్రతీసారి సరికొత్త రికార్డులు క్రియేట్ చేసిన ఈ క్రేజీ కాంబో, ఇప్పుడు నాలుగోసారి 'అఖండ 2: తాండవం'తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే ఫ్యాన్స్‌లో అంచనాలు హై రేంజ్‌లో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన బర్త్‌డే గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేయగా, ఇప్పుడు మరో పవర్‌ఫుల్ అప్‌డేట్‌తో టీమ్ వచ్చేసింది. లేటెస్ట్‌గా, 'అఖండ 2' నుంచి "బ్లాస్టింగ్ రోర్" పేరుతో ఒక యాక్షన్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్ యాక్షన్ ప్యాక్డ్‌గా, బాలయ్య మార్క్ పవర్‌తో గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఇందులో బాలకృష్ణ అఘోర క్యారెక్టర్ కాకుండా కామన్ మ్యాన్ క్యారెక్టర్‌ను పరిచయం చేశారు. బోయపాటి తనదైన స్టైల్‌లో డిజైన్ చేసిన యాక్షన్ సన్నివేశాలు, బాలయ్య ఎనర్జీ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నాయి. విజువల్స్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. అయితే, ఈ టీజర్‌కే హైలైట్‌గా నిలిచింది బాలకృష్ణ చెప్పిన ఒకే ఒక్క డైలాగ్. "సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో.. ఏ సౌండ్‌కు నవ్వుతానో.. ఏ సౌండ్‌కు నరుకుతానో నాకే తెలీదు" అంటూ బాలయ్య తనదైన స్టైల్‌లో, గంభీరమైన వాయిస్‌తో చెప్పిన ఈ డైలాగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఈ ఒక్క డైలాగ్ చాలు, సినిమాలో మాస్ ఎలిమెంట్స్ ఏ రేంజ్‌లో ఉండబోతున్నాయో చెప్పడానికి. టీజ ర్‌లో చూపించిన యాక్షన్ ఎపిసోడ్, సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. యాక్షన్ కొరియోగ్రఫీ, బాలయ్య పెర్ఫార్మె న్స్‌కు థియేటర్లలో విజిల్స్‌తో పెద్ద వేవ్ క్రియేట్ చేయడం ఖాయమనిపిస్తోంది. మొదటి 'అఖండ'లో చూపించిన రెండు విభిన్న పాత్రల తరహాలోనే, ఇందులో కూడా బాలకృష్ణ తన నటనతో, క్యారెక్టర్ వేరియేషన్స్‌తో అదరగొట్టబోతున్నారని టీజర్ చూస్తే అర్థమవుతోంది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి తేజస్విని సమర్పిస్తున్నారు. ఎస్.ఎస్. తమన్ మరోసారి తన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో మ్యాజిక్ చేయడానికి సిద్ధమవుతున్నాడు. ఆది పినిశెట్టి కీలక పాత్రలో నటిస్తుండగా, సంయుక్త మీనన్ హీరోయిన్‌గా కనిపించనుంది. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం డిసెంబర్ 5న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.


# 'మౌగ్లీ' సయ్యారే మెలోడీ.. నిశ్శబ్దంలో గట్టిగా ప్రేమించేలా..



యాంకర్ సుమ కుమారుడు హీరోగా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకోవాలి అని గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాడు. 'బబుల్‌గమ్'తో డీసెంట్ డెబ్యూ అందుకున్న ఈ యంగ్ హీరో, ఇప్పుడు తన రెండో సినిమాతో ఆడియన్స్‌ను అలరించడానికి రెడీ అవుతున్నాడు. ఈసారి ఏకంగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సందీప్ రాజ్‌తో చేతులు కలపడం విశేషం. 'కలర్ ఫోటో' లాంటి ఫీల్ గుడ్ మూవీని అందించిన సందీప్, ఇప్పుడు రోషన్‌తో 'మౌగ్లీ 2025' అనే ఒక యూనిక్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ చిత్రంపై మంచి అంచనాలే ఉన్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఒక రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ సినిమాపై క్యూరియాసిటీని పెంచగా, ఇప్పుడు మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్లను స్టార్ట్ చేశారు. అందులో భాగంగా, సినిమాలోని మొదటి సింగిల్ 'సయ్యారే'ను తాజాగా విడుదల చేశారు. ఈ పాట వింటుంటే, సినిమాలోని ఫీల్ ఏంటో స్పష్టంగా అర్థమవుతోంది.

ఈ పాటలో ఒక యూనిక్ లవ్ స్టోరీని చూపించారు. హీరోయిన్ (సాక్షి మడోల్కర్)కు మాటలు రావు, వినపడదు. ఆమెను ప్రేమించిన హీరో (రోషన్ కనకాల), ఆమె ప్రపంచంలోకి వెళ్లడానికి, సౌండ్ బ్లాక్ చేసే ఒక ఇయర్ డివైజ్‌ను పెట్టుకుని తన వినికిడి శక్తిని త్యాగం చేస్తాడు. ఆమెకు బదులివ్వలేని ప్రేమను నిశ్శబ్దంలో గట్టిగా ప్రేమిస్తానని ఒక లెటర్ రాసి ఇవ్వడం చాలా టచింగ్‌గా ఉంది. 'సయ్యారే' పాటను వినగానే మనసును తాకే ఒక స్వచ్ఛమైన ప్రేమకథ మన కళ్ల ముందు కదులుతుంది. టాలెంటెడ్ కంపోజర్ కాల భైరవ అందించిన మెలోడియస్ ట్యూన్, బ్యూటిఫుల్ ఆర్కెస్ట్రేషన్ పాటకు ప్రాణం పోశాయి. దీనికి ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ అంతే అందమైన, అర్థవంతమైన సాహిత్యాన్ని అందించారు. హీరో హీరోయిన్ల మధ్య ఉన్న స్వచ్ఛమైన ప్రేమను ఆయన పదాలు అద్భుతంగా వర్ణించాయి. కాల భైరవ స్వయంగా ఈ పాటను ఆలపించగా, ఐశ్వర్య దరూరి వాయిస్ పాటకు మరింత మాధుర్యాన్ని జోడించింది. రోషన్ కనకాల తన పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నాడు. సాక్షి మడోల్కర్‌తో అతని కెమిస్ట్రీ చాలా క్యూట్‌గా ఉంది. 'సయ్యారే' పాట కచ్చితంగా చార్ట్‌బస్టర్‌గా నిలిచేలా ఉంది. మంచి కంపోజిషన్, అర్థవంతమైన సాహిత్యం, సోల్‌ఫుల్ వోకల్స్, అందమైన విజువలైజేషన్.. అన్నీ పర్ఫెక్ట్‌గా కుదిరాయి. ఈ చిత్రంలో బండి సరోజ్ కుమార్ విలన్‌గా నటిస్తుండగా, హర్ష చెముడు కూడా కీలక పాత్రలో కనిపించనున్నాడు. రామ మారుతి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని, 'మౌగ్లీ 2025' డిసెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. మరి ఈ సినిమాతో రోషన్ ఏ స్థాయిలో సక్సెస్ అందుకుంటాడో చూడాలి.

# వయసు నంబర్ మార్చేస్తే ఎలా మలైకా?







గ్లామ్ అండ్ గ్లిజ్ ప్రపంచంలో మాయా మశ్చీంద్రల గురించి ఎంత చెప్పినా తక్కువే. పిమ్మిని బమ్మిని చేసే మాయావులకు కొదవేమీ లేదు. ఒక్కోసారి వయసు ఒక నంబర్ మాత్రమేనని భ్రమింపజేసే మాయా మోహినులు ఇక్కడ ప్రత్యక్షమవుతుంటారు. ఇప్పుడు అదే కేటగిరీలో చేరిపోయింది మలైకా అరోరా ఖాన్. ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే! అనే రేంజులో చెలరేగిపోతూ నిరంతర ఫోటోషూట్లతో మాయ చేస్తున్న ఈ సీనియర్ బ్యూటీ వయసు ఎంతో ఎవరైనా కనిపెట్టగలరా? జస్ట్ 30 ప్లస్ అని చెప్పినా నమ్మేయాల్సిందే. అంతగా గ్లామరస్ ఎలివేషన్స్ పై ఫోకస్ పెట్టే ఈ బ్యూటీ ఇటీవల తన బర్త్ డే పార్టీతో మరోసారి చర్చల్లోకొచ్చింది. ప్రస్తుతం మలైకా పుట్టినరోజు వేడుకల ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో వైరల్ గా మారుతున్నాయి. అయితే ఈసారి బర్త్ డేలో మలైకా ఊహించని విధంగా అడ్డంగా దొరికిపోయింది. బర్త్ డే కేక్ పై 50 నంబర్ అందరి దృష్టిని ఆకర్షించింది. దీని అర్థం మలైకా వయసును ఫేకింగ్ చేస్తోందా? అంటూ పలువురు నెటిజనులు ఆరాలు తీయడం ప్రారంభించారు. అంతేకాదు కొందరు ఇంకాస్త ముందుకు వెళ్లి మలైకా 2019లో 47వ బర్త్ డే వేడుకలు జరుపుకున్న వీడియోలు ఫోటోలను కూడా కనిపెట్టి వెలికి తీసారు. ఒకవేళ 2019లో 47వ బర్త్ డే జరుపుకున్నట్టయితే, 2022 నాటికి మలైకా వయసు 50. కానీ 2025లో వయసు 50కి ఎలా తగ్గిపోయింది? అంటూ ప్రశ్నించడం మొదలు పెట్టారు నెటిజనులు. అయినా మనసుంటే మార్గం లేకపోలేదు.. వయసు ఒక నంబర్ మాత్రమే!నని బలంగా విశ్వసించే గొప్ప అభిమానులు మలైకాకు ఉన్నారు. ఆన్ లైన్‌లో ఒక సెక్షన్ ట్రోలింగ్ లో బిజీ బిజీగా ఉంది..మలైకా ఇప్పటివరకూ దీనిపై స్పందించలేదు. ఈ బ్యూటీ పార్టీలతో పాటు సినిమాలు, రియాలిటీ షోలతోను బిజీ బీజీగా ఉంది. 50 ప్లస్ లోను హిందీ చిత్రసీమలో బిజీ నటిగా కొనసాగుతున్న మలైకా అరోరా చాలా మందికి ఫిట్నెస్ పరంగాను స్ఫూర్తిగా నిలుస్తోంది. ది తాజ్ స్టోరీ, మస్తీ 4, హక్, హలో కౌన్, 120 బహదూర్, కాశీ టు కాశ్మీర్, డ్యాన్సింగ్ డాడ్, జీనత్ ఇలా వరుస చిత్రాలతో మలైకా కెరీర్ పరంగా బిజీ బిజీగా ఉంది.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రభుత్వ మెడలు వంచుతాం - పేద విద్యార్థుల భవిష్యత్తుకు వైయస్ఆర్‌సీపీ అండ

**- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆందోళనలు - ఈనెల 28న అసెంబ్లీల పరిధిలో, నవంబర్ 12న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు**

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్,భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విజయనగరం ధరంపురి తన క్యాంప్ కార్యాలయం అందు విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి పత్రిక సమావేశం నిర్వహించి "వైయస్సార్సీపీ ప్రజా ఉద్యమం" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చిన్న శ్రీను మాట్లాడుతూ..మాజీ సీఎం వైయస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా వైయస్సార్సీపీ పోరాడుతుందని, కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు,మేధావులతో కలిసి ఉద్యమిస్తామని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను గారు తెలియజేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రస్తుతం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణతోపాటు ఈనెల 28న విజయనగరం జిల్లాలో 7 నియోజక వర్గాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహించనున్ననట్టు వివరించారు. నవంబర్ 24 నాటికి సంతకాల సేకరణ పూర్తవుతుందని, ఆ సంతకాల ప్రతులను మాజీ సీఎం వైయస్ జగన్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి రాష్ట్ర గవర్నర్‌కి అంద




జేస్తారని తెలియజేశారు.

**ఈనెల 28న అన్ని అసెంబ్లీల పరిధిలో ర్యాలీలు**

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పజెబుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, మాజీ సీఎం వైయస్ జగన్ నిర్మించిన 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలనే డిమాండ్‌పై ప్రజల్లోనూ చైతన్యం తీసుకురావాలని వైయస్సార్సీపీ సంకల్పించింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయంపై ప్రజల్లో పెల్లుబుకుతున్న ఆందోళనను ప్రజల అభిప్రాయంగా కోటి సంతకాల రూపంలో రాష్ట్ర గవర్నర్‌కి సమర్పించడం జరుగు



తుంది. ఈ కోటి సంతకాల సేకరణలో భాగంగా విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, ప్రజల మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించనున్నాం. ఈ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా భవిష్యత్తు తరాలు ఏవిధంగా నష్టపోతున్నాయో తెలియజేస్తాం. ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కోటి సంతకాల ఉద్యమం మొదలవగా, ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు ప్రకటిస్తున్నారు.. అన్ని ప్రజా సంఘాలు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఇది రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. ఇది రాష్ట్ర



భవిష్యత్తుకి సంబంధించిన అంశం. అందరూ చేయిచేయి కలపాల్సిన అవసరం ఉంది. అన్ని వర్గాల ప్రజలను, అన్ని రాజకీయ పార్టీలను, అన్ని ప్రజా సంఘాలను, ఉద్యమ నాయకులను ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు కెవివి సూర్యనారాయణ రాజు, నేక్కల నాయుడు బాబు, జిల్లా ఉప అధ్యక్షులు అచ్చం నాయుడు, ముకల కస్తూరి, ప్రధాన కార్యదర్శులు నరసింహ మూర్తి, రవి, ఇప్పలి అనంత, జిల్లా అధికారి ప్రతినిధి కనకల రఘురామారావు, సోషల్ మీడియా అధ్యక్షులు వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు సంజీవని వంటిది సుఖీ సురక్ష పథకం : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో ఉండే మహిళల ఆరోగ్యాన్ని పటిష్టంగా ఉంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే సుఖీ సురక్ష అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్ తోటవీధి సచివాలయంలో మెప్మా ఆధ్వర్యంలో సుఖీ సురక్ష కార్యక్రమం నిర్వహించారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ఆదేశానుసారం గంటా నూకరాజు, కార్పొరేటర్ గంటా అప్పలకొండ ఈ కార్యక్రమానికి హాజరై ఏపిడి దొరతో కలసి ప్రారంభించారు. అనంతరం గంటా నూకరాజు మాట్లాడుతూ 35 ఏళ్ళు దాటిన మహిళల ఆరోగ్య రక్షణ కోసం ఈ పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని మహిళలకు ఆరోగ్య రక్షణ, ఆరోగ్య భద్రత లక్ష్యంగా అనుభవజ్ఞులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి కావలసిన సలహాలు, సూచనలు అందించడం, అవసరాన్ని బట్టి మందులు ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 74 మున్సిపాలిటీలో ఈ కార్యక్రమం నిర్వహిం చబడుతుందని అన్నారు. పట్టణంలో నివసించే మహిళల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్నారని అదేవిదంగా ప్రస్తుతం రోజుల్లో వివిధ రకాల ఆహారపు అలవాట్లకు లోనవడం వలన అనేక జబ్బులు, రోగాలు కొని తెచ్చుకుంటున్నామని అందులో భాగమే క్యాన్సర్ అని అన్నారు. ఈ మహమ్మారి రోజురోజుకు త్వరగా వ్యాప్తి చెందుతుందని ప్రారంభ దశలో ఉండేటప్పుడు నివారణ సాధ్యమని కానీ థర్డ్ స్టేజ్‌కి వస్తే చాలా ప్రమాదమని అందువలన వైద్యుల యొక్క సలహాలను పాటించి క్యాన్సర్ వ్యాధి యొక్క లక్షణాలు తెలుసుకోవడం, సరైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం, మంచిగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం చేయాలని గంటా నూకరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిడి దొర, సిఓలు శేఖర్, విజయలక్ష్మి, సి.ఎల్.ఎఫ్ ఆర్పీ శ్రీదేవి తెలుగుదేశం పార్టీ నాయకులు సంకురుబుక్త జోగారావు, జలగడుగుల మురళి, కుప్పిల గురుమూర్తి, వియ్యపు పోతురాజు, కందుల సుందర్ రావు, సంజీవ రావు, వైద్య సిబ్బంది మరియు ఆర్పీలు పాల్గొన్నారు.

# కోటి సంతకాల సేకరణలో సిరమ్మ





**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి నియోజకవర్గం,మధురవాడ, 6వ వార్డులో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైస్సార్ సిపీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి వైస్సార్ సిపీ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ పోతిన ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్ఆర్ సీపీ కోటి సంతకాలు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు ముందుగా డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు అనంతరం తాను స్వయంగా అందరిచే సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ మాట్లాడుతూ ప్రజా వైద్యం ప్రజల హక్కుఅని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్ సీపి.కోటి సంతకాల సేకరణ కార్యక్రమం విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో పేదవాడికి విద్య వైద్య అందుబాటులో లేదు అని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు.

మెడికల్ కాలేజీలు పేద ప్రజల ఆరోగ్యానికి జీవనాడి అని మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తే పేదవాడికి వైద్యం ఎక్కడ అందుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహిళలు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు మరియు చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షుడు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు, అధిక సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

# టిడిపిలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు

**- కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ - కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మంత్రి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కష్టపడి పని చేసిన కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ తగిన గుర్తింపుని ఇస్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నెల్లూరు చింతారెడ్డిపాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నారాయణ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల ఇన్చార్జిలు కార్యకర్తలతో మంత్రి నారాయణ ప్రత్యేకంగా మాట్లాడారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ డివిజన్ ఇన్చార్జిలకు మంత్రి దిశ నిర్దేశం చేశారు. కమిటీల నియామకంపై కార్యకర్తలకు నాయకులకు మంత్రి నారాయణ క్లారిటీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు నాయకులకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. కష్టపడి పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలంటూ మంత్రి సూచించారు. రానున్న వర్షాలు నేపథ్యంలో కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజలకి అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పిటిసి విజేత రెడ్డి, టిడిపి నెల్లూరు నగర అధ్యక్షుడు మామిడాల మధు, అన్ని డివిజన్ల అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

**- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండండి - టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ అధికారులకు, కమిషనర్లకు సూచించిన రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ - నెల్లూరు నుండి టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు చేసిన మంత్రి - లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశాలు**

**- ఎక్కడ కూడా అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా అందుబాటులో ఉండాలని సూచన**

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ గురువారం మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తం చేశారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయం నుండి మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు టెలి కాన్ఫరెన్స్‌లో పాల్గొని మంత్రికి ఆయా ప్రాంతాల్లోని పరిస్థితిని వివరించారు. వర్షాల నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి పరిస్థితులునైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని సూచించారు. ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని తెలియజేశారు. వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు



తీసుకోవాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో 24 గంటలు పని చేసేలా కాల్ సెంటర్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తగా ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌లను కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పోలీసు, వైద్యారోగ్య శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు.


# వేద పాఠశాల నిర్మాణానికి సహకారం : ఎమ్మెల్యే



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వేద పాఠశాల నిర్మాణానికి పూర్తి సహకారాన్ని అందించనున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప హామీ ఇచ్చారు. పెద్దాపురం పట్టణంలో నిర్మిస్తున్న వేద పాఠశాల పనులను శాసనసభ్యులు చినరాజప్ప గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడి దానిలోని విశిష్టతను కాపాడేందుకు చేస్తున్న కృషిలో భాగంగా పెద్దాపురం పట్టణంలో వేద పాఠశాల నిర్మించడం అభినందనీయం అన్నారు. పాఠశాల నిర్మాణానికి అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె శ్రీ రమణి, తహశీల్దార్ వెంకటలక్ష్మి, తెదేపా నియోజకవర్గ యువ నాయకులు నిమ్మ కాయల రంగనాగ్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఏఎంసీ చైర్ పర్సన్ నూనె మంగాలక్ష్మి రామారావు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మిడివరం బాలయోగీశ్వర్లను దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎంపీ

**అమలాపురం, (రాజధాని వార్తలు):** కోనసీమ తపో జ్ఞానిగా పేరుగాంచిన ముమ్మిడివరం ఓం భగవాన్ పెద్ద బాలయోగీశ్వరులను స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు,అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగిలు దర్శించుకున్నారు. పెద్ద బాల యోగేశ్వరుల జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలోని పెద్ద బాలయోగీశ్వరుల ఆలయం వద్ద గురువారం జరిగిన 95వ జయంతి వేడుకలలో బుచ్చిబాబు, హరీష్ బాలయోగిలు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా ఆలయ కమిటీ ఎమ్మెల్యే బుచ్చిబాబు ఎంపీ హరీష్ బాలయోగిలను ఘనంగా సన్మానించారు.



# జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాధిత మత్స్యకార కుటుంబాలను కలిసిన ఆర్.డి.ఓ కీర్తి





## - బాధిత కుటుంబాలను ఓదార్చిన ఎం.పి, ఎం.ఎల్.ఏలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న 8 మంది మత్స్యకారుల కుటుంబ సభ్యులను గురువారం విజయనగరం ఆర్.డి.ఓ డి.కీర్తి విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో కలిశారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్.డి.ఓ బాధిత కుటుంబాలతో మాట్లాడి బంగ్లాదేశ్ నుండి రప్పించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలు అడ్రస్‌లు, బ్యాంక్ అకౌంట్ వివరాలను తీసుకొని, అన్ని విధాలా అండగా ఉంటామని వారికి చెప్పారు. అలాగే ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎం.ఎల్.ఏ లోకం నాగ మాధవి, మార్కుఫెడ్ చైర్మన్ బంగార్రాజు కూడా బాధిత కుటుంబాలను కలిసి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు పై వివరించారు.

# భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అరుదైన ఘటన

**- 5 కేజీల బాల భీముడికి, భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో జన్మనిచ్చిన తల్లి రాణి - తల్లి బిడ్డ, క్షేమంగా ఉన్నారని తెలిపిన భద్రాచలం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మరియు వైద్యులు**





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈరోజు మధ్యాహ్నం అడుగైన ఘటన చోటు చేసుకుంది, మణుగూరు పట్టణానికి చెందిన, జోగునూరు బాబు, అతని భార్య అయిన జోగునూరు రాణికి పురిటి నొప్పులు రావడంతో, మణుగూరు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా, అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి గర్భిణీ స్త్రీ అయిన రాణికి, షుగర్ లెవెల్స్ బాగా ఎక్కువగా ఉండడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ ఆధ్వర్యంలో గైనకాలజిస్ట్ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి తల్లి బిడ్డ క్షేమంగా ఉండాలని, వెనువెంటనే ఆపరేషన్ నిర్వహించి పండంటి మగ బిడ్డకు కాన్పు చేశారు, పుట్టిన మగ బిడ్డ బరువు చూడగా ఒక్కసారిగా హాస్పటల్ సిబ్బంది మరియు కుటుంబ సభ్యులు ఆశ్చర్యానికి గురయ్యారు పుట్టిన మగ బిడ్డ ఐదు కేజీలు ఉండి బాల భీముడులా ఉండటం కాన్పు చేసిన డాక్టర్, మరియు సిబ్బంది, మరియు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు, అనంతరం తల్లి బిడ్డను పరీక్షించిన వైద్యులు తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని, ఇలాంటి ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరగటం ఎంతో ఆనందంగా ఉందని, పేద ప్రజలందరూ ప్రభుత్వ సేవలు వినియోగించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేపించుకోవాలని భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ అన్నారు.

# తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా రూపకల్పన

**- జగన్ అవినీతి, అక్రమాల గుట్టు రట్టయిందంటూ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తీవ్ర విమర్శలు**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తాడేపల్లి ప్యాలెస్ నుంచే కల్తీ మద్యం కుట్రలు పుట్టుకొస్తున్నాయని టీడీపీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. గురువారం తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని లిక్కర్ మాఫియా రాజ్యంగా మార్చారని, 3,500 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ఈ లిక్కర్ దోపిడీ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే జగన్ కుట్రల పన్నాగాలు పన్నుతున్నారని మండిపడ్డారు. చిత్తూరు జిల్లా ములకలచెరువు, హీబ్రహీంపట్నం ఘటనల వెనుక కూడా తాడేపల్లి ప్యాలెస్ కుట్రలే ఉన్నాయని రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతోనే ఈ కల్తీ మద్యం ఫార్ములా తాడేపల్లి ఫ్యాక్టరీలో తయారైందని ఎద్దేవా చేశారు. సెప్టెంబర్‌లో ఆఫ్రికా వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్న జనార్దన్‌రావు, 23వ తేదీన జోగి రమేష్ను ఇంటికి పిలిపించుకుని ప్రణాళికలు రచించారని తెలిపారు. ఈ ఇద్దరూ సన్నిహిత మిత్రులని, వీళ్లిద్దరూ కలసి కల్తీ మద్యం వ్యవహారానికి రూపురేఖలు సిద్ధం చేశారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం కంపెనీలన్నీ జగన్ గుప్పెట్లోకి వెళ్లిపోయాయని, 'జే బ్రాండ్స్' అనే పేరుతోనే మద్యం విక్రయాలు జరిగాయని ఆరోపించారు. దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది అమాయకులు చనిపోయారని, మరో 30 లక్షల మంది కల్తీ మద్యం వల్ల అనారోగ్యానికి గురయ్యారని మండిపడ్డారు. ఇంతటి ప్రజా నష్టానికి కారణమైన జగన్ రెడ్డిని ఉరితీయించినా పాపం లేదని ఎమ్మెల్యే రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల డబ్బులు దోచుకుని, ఆరోగ్యాన్ని పాడు చేసిన వ్యక్తి ఇప్పుడు నీతిమాలిన ఆరోపణలు చేయడం దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. "జగన్ రెడ్డి అవినీతి, కల్తీ మద్యం రాజ్యం సృష్టించాడు. ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఫార్ములాలు తయారు చేసి కూటమిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడు" అని విర్శంచారు. తనకు భూ ఆక్రమణలతో సంబంధం ఉందని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. తాను ఉంటున్న ఇల్లు తప్ప వెంకటగిరిలో ఎక్కడా సెంటు భూమి లేదన్నారు ఒకవేళ ఏవరైనా ఉన్నట్లుగా రుజువు చేస్తే అవి వాళ్లకే రాసిస్తానని చెప్పారు.

# మత్స్యకారులను రప్పించేందుకు ముమ్మర చర్యలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** బంగ్లాదేశ్ నేవీకి చిక్కిన విజయనగరం జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను స్వదేశానికి క్షేమంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు వేగవంతం చేసిందని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర సరిహద్దులోకి ప్రవేశించిన ఈ మత్స్యకారుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై, కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎం ఈ ఏ) నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోందని కలెక్టర్ చెప్పారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఏపీ భవన్ ద్వారా అధికారిక చర్చలు కొనసాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విదేశాంగ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ బి.శ్యామ్‌ను సంప్రదించి కేసు పురోగతిని తెలుసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, బంగ్లాదేశ్‌లో మత్స్యకారులపై చార్జ్‌షీట్ దాఖలయిందని, అయితే ఢాకాలోని భారత హైకమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయ బృందం వారిని రక్షించేందుకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తోందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిరంతరం హైకమిషన్ మరియు బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరుపుతూ ఉందని చెప్పారు. బాధిత కుటుంబాలను జిల్లా పరిపాలన నిరంతరం సంప్రదిస్తూ, వారికి అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ పేర్కొన్నారు. తన ఆదేశాల మేరకు ఆర్డీఓ డి.కీర్తి విశాఖపట్నం వెళ్లి బాధిత కుటుంబాలను కలిసి ధైర్యం చెప్పారని తెలిపారు. మత్స్యకారులను క్షేమంగా దేశానికి తీసుకురావడం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిరంతరం కృషి చేస్తోందని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# అట్టహాసంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ – నెల్లూరు వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలను డి.కె.డబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు నందు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ నిర్మాణానికి మూల స్తంభంలాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి శ్రీ స్వామి వివేకానంద అనేక ఉత్తేజకర ప్రసంగాలు చేశారని అందులో "స్వయంకృషి పట్టుదల దృడసంకల్పం ఈ మూడు మనల్ని ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దుతుంది అనే ప్రసంగాన్ని యువతకు తెలియజేస్తూ యువత దానిని స్ఫూర్తిగా తీసుకోవాలని తెలియజేశారు. ఎ.నాగేశ్వర రావు, ముఖ్యకర్యనిర్వహణాధికారి, సెట్నెల్ మాట్లాడుతూ యువతః అందరూ స్వామి వివేకానందుని బాటలో నడవాలని యువతను ఉద్దేశించి పట్టుదల వదలకుండా చేసే ప్రయత్నం చివరకు విజయాన్ని చేకూరుస్తుందనిఒక్క రోజులో ఏమి సాధించలేమని తెలియజేశారు. గిరి, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత అందరూ మందలో ఒక్కరిగా ఉండకండి వందలో ఒక్కరిగా ఉండటానికి ప్రయత్నించాలని తెలియజేశారు. యం.రమణా రెడ్డి. డి.కె.డబ్ల్యూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లూరు మాట్లాడూతూ ఈ దేశం పురోగతి సాధించాలన్న యువతను విజ్ఞానవంతులుగా, నిపుణులుగా తీర్చిదిద్దుకోవాలని అనే స్వామి వివేకానంద సూక్తిని తెలియజేశారు. ఈ జిల్లా యువజనోత్సవాల నందు నిర్వహించిన పోటీలలో న్యాయనిర్ణేతలచే 1, 2వ స్థానం పొందిన వారి యొక్క పేర్లను దృవీకరించడమైనది. జానపద నృత్యం (గ్రూప్) నందు కె.నిఖిత బృందం మొదటి స్థానం, జి. సుప్రియ బృందం ంండవ స్థానం, జానపద సంగీతం (గ్రూప్) నందు వి.యస్.ఆయాన బృందం మొదటి స్థానం, టి.భవాని బృందం రెండవ స్థానం, కథా రచన నందు ఆర్.మహేష్ మొదటి స్థానం, వి.మహిత రెండవ స్థానం, పెయింటింగ్ నందు కె.వైష్ణవి మొదటి స్థానం, వి.చందన రెండవ స్థానం, ప్రసంగ పోటీ నందు బి.అభిషేక్ మొదటి స్థానం, షేక్ రజియా రెండవ స్థానం, కవిత రచన నందు చదలవాడ జైస్పాల్ మొదటి స్థానం, యం కవిత రెండవ స్థానం, సైన్సు మేళా నందు మొహమ్మద్ జహీర్ అహ్మద్ బృందం మొదటి స్థానం, డి.సీతామహాలక్ష్మి బృందం రెండవ స్థానం కైవసం చేసుకునారు.

పై పోటీలలో తమ ప్రతిభ కనబరచిన కళాకారులందరిని ఎ.నాగేశ్వర రావు, ముఖ్యకార్యనిర్వహణాధి కారి, సెట్నెల్, నెల్లూరు వారు అభినందిచడం జరిగినది. ఈ కార్యక్ర మంలో ఎ.మహేంద్ర రెడ్డి, జిల్లా యూత్ అధికారి, నెహ్రు యువ కేంద్ర, నెల్లూరు, కె.ఈశ్వరమ్మ, కల్చరల్ కన్వీనర్, డి.కె.డబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సెట్నెల్ మేనేజర్ బి. శ్రీనివాస రావు, సెట్నెల్ సూపరింటెండెంట్ యం.డి. గయాస్ అహ్మద్ మరియు సెట్నెల్ & కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 459 మంది యువత హాజరైనారు.

# వైద్య పోరాట ధర్నా





**అమలాపురం, (రాజధాని వార్తలు):** బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు భూషి జాన్ మోషే అధ్యక్షతన అమలాపురం కలెక్టర్ ఆఫీస్ వద్ద వైద్య పోరాట ధర్నా నిర్వహించారు.

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరే కంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కలెక్టర్‌కి రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగినది ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గెడ్డం సంపద రావు కొల్లాబత్తుల సత్యం మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి జగన్ 50 శాతం వైద్య సీట్లను ప్రైవేటు సంస్థలకు అమ్ముకుంటే ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం మొత్తం 100 శాతం ప్రైవేట్ సంస్థలకు అమ్ముకోవడం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను డాక్టర్లు కానీఇవ్వకుండా చేయడమే నని ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న నిరుద్యోగులను విద్యార్థుల ను ప్రజలను అందర్నీ మోసం చేస్తూనే ఉన్నాయని బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడే అన్ని సమాజక వర్గాలకు అన్ని విషయాలలో మేలు జరుగుతుందని అన్నారు ఈ సమావే శంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పట్నాల విజయకుమార్ కాకినాడ జిల్లా అధ్యక్షులు మాత సుబ్రహ్మణ్యం అంబేద్కర్ జిల్లా ఇన్చార్జి కుసుమ వెంకటేశ్వరరావు వాకపల్లి భీమారావు ఉపాధ్యక్షులు జిత్తుక సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి అయినపర్తి ప్రియదర్శిని ఊడిమూడి ఎంపీటీసీ కార్యదర్శి కోణాల ప్రకాష్ కోశాధికారి కాండ్రేగుల గంగరాజు అమలాపురం నియోజకవర్గం ఇంచార్జ్ పొలమూరి మోహన్ బాబు అధ్యక్షులు పెయ్యాల ప్రతాప్, గన్నవరం అధ్యక్షులు తాడి రాంబాబు.రాజోలు అధ్యక్షులు నల్లి ప్రసాదరావు. ముమ్మిడివరం అధ్యక్షులు బదుగు భీమేష్.కొత్తపేట అధ్యక్షులు గుర్రపు కొత్తియ్యా. అన్ని నియోజకవర్గాల ఇన్చార్జులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫోసిస్‌కి సీతం విద్యార్థినులు ఎంపిక

**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినిలు ఇన్ఫోసిస్‌కి జరిగిన పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపిక అయ్యారు. వీరిలో ఒక విద్యార్థిని ఎమ్ సి ఏ నుండి పిన్నింటి పూజిత, సి ఎస్ సి విద్యార్థిని పి భాను తేజస్వని, ఇ సి ఇ విద్యార్థిని ముగడ స్వాతి ఎంపిక అయ్యారు. వీరికి సుమారు 3.6 ఎల్‌పిఏ ఆఫర్ చేసారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు వీరికి అభినందనలు తెలియజేసారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కళ్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# సత్య సాయిని దర్శించుకున్న మంత్రి కొండపల్లి




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం పొట్టా వీధి సమీపంలో గల కోవెల సముదాయంలో ఉన్న సత్య సాయి మందిరంలో సత్య సాయిని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం దర్శించుకున్నారు. సత్య సాయి శతవర్ష జన్మదినోత్సవ వేడుకలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వామి చూపించిన శాంతి మార్గంలోనే నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇతరులపై ప్రేమ చూపిస్తూ వీలైనంత సేవ చేస్తూ స్వామి పిలుపునిచ్చిన సేవే దైవం ప్రేమే మార్గం నినాదాన్ని గౌరవిస్తూ జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్పీటిసి మక్కువ శ్రీధర్ పిఎసిఎస్ అధ్యక్షులు ఎల్.బంగారు నాయుడు, వైకుంఠం ప్రదీప్ కుమార్, పండు, సత్య సాయి భక్తులైన యు.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్యసాయి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం

### - ఇన్ ఫ్లో :32వేల232 క్యూసెక్కులు - ఔట్ ఫ్లో :42 వేల 650 క్యూసెక్కులు

**అనంతసాగరం, (రాజధాని వార్తలు):** సోమశిల జలాశయానికి పై తట్టు ప్రాంతాల నుంచి గురువారం 32 వేల 232 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది..జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టి.ఎం.సిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 69.679 టి.ఎం.సి ల నీరు నిల్వ ఉంది.జలాశయం నుంచి ఉత్తర కాలువ కు 50 క్యూసెక్కుల నీరు, దక్షిణ కాలువ కు 760 క్యూసెక్కుల నీరు, క్రస్ట్ గేట్ల నుండి పెన్నాకు 42,620 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు జలాశయ అధికారులు తెలిపారు.



# నవజీవన్ ఆర్గనైజేషన్ - సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ పై అవగాహన





**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశముల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారంతో ఈరోజు నవజీవన్ ఆర్గనైజేషన్ -సి.సి- పి.యు- ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును వెంకటగిరి లోని "సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్" నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో భాగముగా ప్రాజెక్ట్ మేనేజర్ అయిన కె.బాలాజి మాట్లాడుతూ, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ లక్షణాలు, అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజములో కలసి జీవించాలి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబందం గూర్చి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గూర్చి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగము గూర్చి, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఏక్ట్ 2017, ఎ.ఆర్.టి మందులు, ఏ.పి.శాక్స్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గూర్చి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ యన్. సుమలత, నవజీవన్-సి.సి-పి.యు ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజి, ఓ.ఆర్. డబ్ల్యూ వి.మునికుమారి, పి.ఇ లు మరియు 50 మంది హాస్టల్ బాలికలు పాల్గొనడం జరిగింది. తదుపరి హాస్టల్ బాలికలుతో కలిసి రాజాస్ట్రీట్ ఏరియాలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో మొత్తం 50 మంది బాలికలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# పి జి ఆర్ ఎస్ పై ఆర్డీవో సమీక్ష

**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ మండలం కరప తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) ఎస్. మల్లిబాబు గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా గృహ పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్), ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐ వి ఆర్ ఎస్) అమలు, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్ అంశాలపై ఆయన చర్చించారు.

అనంతరం ఆర్డీవో ఎస్.మల్లి బాబు మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజల ఫిర్యాదులను తక్షణమే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్ఓలకు సూచించారు. గ్రామ స్థాయిలో సమాచారం సరిగ్గా అప్‌డేట్ చేయడంలో నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ డి. దుర్గాప్రసాద్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.పవన్ కుమార్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan